క్లుప్తంగా...

శ్రీరాజమాత ఫౌండేషన్ ప్రతినిధులకు అవార్డులు

బోడుప్పల్: చెంగిచర్ల క్రాంతి కాలనీలోని శ్రీరాజమాత ఫౌండేషన్ ప్రతినిధులకు బెస్ట్ హ్యూమనిటీ అవార్డు–2023 వరించింది. శ్రీలంక టీబీసీ సంస్థ విభిన్న రంగంలో ప్రతిభ చాటుతున్న వారిని, సమాజ సేవ చేస్తున్న వారిని గుర్తించి ఈ అవార్డులు అందజేస్తోంది. శ్రీరాజమాత ఫౌండర్, అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, వారి తల్లిదండ్రులు ఏపీఎస్ రెడ్డి, మంగమ్మకు ప్రశంసా పత్రాలు, అవార్డ్స్‌ను కొరియర్ ద్వారా పంపినట్లు వెల్లడించారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్

బోడుప్పల్: అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ అన్నారు. బొల్లిగూడ బాలాజీ నగర్‌కు చెందిన పద్మావతికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.25 వేల చెక్కును మంగళవారం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. పడతం లోకేష్, కుమార్ శేఖర్, దామోదర్, చిప్పల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లాపూర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

హబ్సిగూడ: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా బుధవారం మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్, అశోక్‌నగర్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పాదయాత్రకు బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాఠ్యాంశాలు భవిష్యత్‌కు దిక్సూచిగా ఉండాలి


టెక్నో ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

రామంతాపూర్: రామంతాపూర్‌లోని ఆరోరా పీజీ కళాశాలలో టెక్నో కల్చరల్ ఫెస్ట్ అన్వేషణ–2023 తొలిరోజు కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అధిపతి ఆచార్య డి.శ్రీరాములు, సిటీ సివిల్ కోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ జడ్జి గోగి కళార్చన, ఆధ్యాత్మికవేత్త నందివాడ అనంతలక్ష్మి, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సోమేశ్వర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాలయాల నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో విజ్ఞానాన్ని పెంపొందించుకొని విజ్ఞానవంతమైన సమాజానికి రూపకల్పన చేయాలన్నారు. విద్యార్థుల భవితకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పాఠ్యాంశాలతో కోర్సులు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోరా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ డాక్టర్ నిమ్మటూరి రమేష్ బాబు, కళాశాల డైరెక్టర్ ప్రొ.డా.ఎం.మాధవి, డా.సతీష్ కుమార్, దేవేందర్‌రావు, స్లమ్ డాగ్ హస్బెండ్ ఫేం సినీ నటుడు సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



మౌలాలి: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా డివిజనల్ ఉప ట్రెజరీ అధికారికి వినతిపత్రం అందచేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్లు చెల్లించాలని, 2023 వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని, ఈహెచ్ఎస్ పథకం కింద అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. పి.నారాయణరెడ్డి, బాలగంగాధర్, నిరంజన్, కమలకుమారి, అజయ్‌కుమార్, అశోక్, మురళీమోహన్, నర్సింగ్‌రావు, సూర్యకుమార్ తదతరులు పాల్గొన్నారు.

హెచ్‌బీకాలనీలో అల్లూరి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి



మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ చౌరస్తాలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



మహనీయులకు ఘన నివాళి


మల్కాజిగిరి చౌరస్తాలో దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తూ..

కుషాయిగూడ: బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం హెచ్‌బీకాలనీలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, దూసరి నవీన్‌గౌడ్, పూస రమేష్, రామకృష్ణ, నరేందర్, జయపాల్ పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

మల్లాపూర్: మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ చౌరస్తాలో ఉన్న కొమురయ్య విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు స్ఫూర్తి

దొడ్డి కొమురయ్య నేటి యువతకు స్ఫూర్తి అని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. దొడ్డి కొమురయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య మనవడు దొడ్డి యాదగిరి, బీజేపీ మల్లాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఆలేటి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మల్లాపూర్‌లో దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

కురుమ సంఘం ఆధ్వర్యంలో..

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం కురుమ సంఘం ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. జోగు వెంకటేష్, మిరాల రాంచందర్, మురళీకృష్ణ, చంద్రశేఖర్, చేగూరి రామ్మోహన్, అసర్ల శ్రీకాంత్, గుత్తి రాంచందర్, కుమారస్వామి పాల్గొన్నారు.

స్వామి వివేకానంద.. యువతకు స్ఫూర్తి

గౌతంనగర్: స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి అని వివేకానంద రైసింగ్ సొసైటీ అధ్యక్షుడు కుమ్మరి రాజు అన్నారు. మంగళవారం గౌతంనగర్‌లో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. సొసైటీ ప్రతినిధులు మహ్మద్ రషీద్, డాక్టర్ సుధాకర్, ధనుంజయ్, అనుదీప్, తిరుమలరావు, లచ్చయ్య, జయంత్ తదితరులు ఉన్నారు.


గౌతంనగర్‌లో స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న వివేకానంద రైసింగ్ సొసైటీ సభ్యులు

ప్రభుత్వ నిరాశ్రయుల భవనంలోకి ఉప్పల్ డిగ్రీ కాలేజీ


డిగ్రీ కళాశాల ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఉప్పల్: అరకొర సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నందున ఉప్పల్ డిగ్రీ కళాశాలను తాత్కాలికంగా ఉప్పల్ కూరగాయల మార్కెట్‌లోని ప్రభుత్వ నిరాశ్రయుల భవనంలోకి మార్చాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ రజిత వినతి మేరకు మంగళవారం స్థానిక కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక గదుల్లో కొనసాగుతున్న డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఉప్పల్ అన్నింటికీ అందుబాటులో ఉన్నందున ఈ ఏడాది చాలామంది విద్యార్థులు ఉప్పల్ కళాశాలను ఎంచుకున్నారని, దాంతోపాటు సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే కళాశాలను మార్కెట్‌లో ఉన్న నిరాశ్రయుల భవనానికి తరలించాలని ఈఈ నాగేందర్‌కు సూచించారు. రెండు మూడు రోజుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఈఈ నాగేందర్ తెలిపారు. ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యం


బైక్ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ తదితరులు

రామంతాపూర్: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 9 ఏళ్ల పూర్తయిన సందర్భంగా మంగళవారం రామంతాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల పాలనలో పేదల సంక్షేమంతో పాటు సుస్థిర సుపరిపాలన అందించిన ఘనత ప్రధానమంత్రి మోదీకే దక్కుతుందన్నారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లును దేశప్రజలంతా బలపర్చాలని ఆయన కోరారు. బీజేపీ రామంతపూర్ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, జగదీష్, డివిజన్ పరిశీలకుడు ప్రసాద్, శక్తి కేంద్రాల అధ్యక్షులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల ఆధునీకరణకు రూ.1.10 కోట్లు


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: ఉప్పల్ కాయగూరల మార్కెట్‌లోని రెడ్డి, మున్నూరు కాపు శ్మశానవాటికలను రూ.1.10 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి శ్మశానవాటిక ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఇప్పటికే మల్లాపూర్‌లో వైకుంఠదామాన్ని నిర్మించుకున్నామని, ఇదే తరహాలో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని శ్మశానవాటికలను ఆధునీకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ సాయికిరణ్, బీఆర్ఎస్ నాయకులు మేకల మధుసూదన్‌రెడ్డి, వేముల సంతోష్‌రెడ్డి, లేతాకుల రఘుపతిరెడ్డి, సత్యపాల్‌రెడ్డి, రాజు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కాప్రా: జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అధికారులతో కలిసి బుధవారం నుంచి చేపట్టే పాదయాత్రపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పూర్తిచేసిన అభివృద్ధి పనులు, కొనసాగుతున్న పనులు, చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా కాలనీల్లో సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకర్, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, కాప్రా సర్కిల్ ఈఈ హరిలాల్, ఏఎంహెచ్‌వో డాక్టర్ స్వప్నరెడ్డి, జలమండలి డీజీఎం సతీష్‌కుమార్, ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, కుషాయిగూడ సీఐ ప్రవీణ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు అశోక్, షానవాజ్, డీఈ రూప, ఏఈలు అభిషేక్, కీర్తి, స్వరూప, స్రవంతి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, విద్యుత్ ఏఈ రవీందర్, హార్టికల్చర్ మేనేజర్ నర్సింహరావు, నరోత్తంరెడ్డి, ఎంటమాలజీ రమేష్, తదతరులు పాల్గొన్నారు.

బోనాలకు ముస్తాబవుతున్న పీర్జాదిగూడ

మేడిపల్లి: బోనాల పండగను ఈ నెల 16 ఆదివారం ఘనంగా జరుపుకోవాలని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. పీర్జాదిగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ పెద్దలు కలిసి సంయుక్తంగా అంగీకరించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆశాఢమాసం చివరి ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించుకోవాలని ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అమ్మవారి ఆలయాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించేలా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ ప్రదీప్ కుమార్, నాయకులు, కాలనీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత


నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్, ప్లేట్లు అందజేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: కుటుంబ, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యే పేదవిద్యార్థులకు చేయూత అందిస్తానని ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నేత, మధుర చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మధుర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్, ప్లేట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలామంది ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి విద్యార్థులకు తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని సహకారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డం యాదగిరి, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, పత్తికుమార్, పోచయ్య, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్ యాదవ్, పెద్ది శ్రీనివాస్, నీరజారెడ్డి, లింగం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణంలో మంత్రి మల్లారెడ్డి


ప్రత్యేక పూజలో మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: టెలిఫోన్ కాలనీలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం 6వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన అమ్మవారి కల్యాణంలో మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. శ్రీరేణుకా ఎల్లమ్మ భక్తుల కోరికలు తీర్చే అమ్మవారిగా పూజలందుకుంటున్నారు. అశోక్‌చే ఒగ్గు కథ నిర్వహించారు. అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, పార్టీ నేతలు కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, బింగి జంగయ్యయాదవ్, సుమన్ నాయక్, నేతలు పులకండ్ల జంగారెడ్డి, గుర్రాల వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


వెంకటాపురం డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని కమలాలయ కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలనీలో ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు వినోద్‌కుమార్, డీవీఎన్ శర్మ, నాయకులు భాస్కర్, అనిల్‌కిషోర్‌గౌడ్, శ్యాంసుందర్, మల్లెల శివ, లక్ష్మణ్ ముదిరాజ్, సయ్యద్ మోసీన్, మల్లేష్, స్వప్న, అమృత, ఈఈ రాజు, డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌కే హోమ్స్ సమస్యల పరిష్కారానికి కృషి

మచ్చబొల్లారం డివిజన్‌లోని ఏఆర్‌కే హోమ్స్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్‌తో కలిసి ఏఆర్‌కే హోమ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ వ్యవస్థ, గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు ప్రపోజల్‌లో ఉన్నాయని, సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, పరమేష్, శ్రీనివాస్‌గౌడ్, పుట్నాల కృష్ణ, శోబన్, దేవేందర్, డీఈ మహేష్, శానిటరీ సూపర్‌వైజర్ ప్రభాకర్, ఏఈ స్వాతి, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఏఆర్‌కే హోమ్స్ ప్రతినిధులు

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: గౌతంనగర్ సబ్‌స్టేషన్ 11కేవీ దయానంద్‌నగర్ ఫీడర్, భవానీనగర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాణీనగర్, భవానీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భవానీనగర్, సాయినగర్, సంతోష్‌నగర్, సంజయ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుదీప్‌రెడ్డి తెలిపారు.

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11కేవీ బాలసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విమలాదేవినగర్, ఎస్ఎస్ఎస్ ఆస్పత్రి ఏరియా, విష్ణుపురి ఎక్స్‌టెన్షన్, రాజీవ్‌గాంధీనగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో, 11 కేవీ శివపురి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు శివపురి కాలనీ, వెస్ట్ ఆనంద్‌బాగ్, నల్లపోచమ్మ దేవాలయం ప్రాంతం, విష్ణుపురి పార్ట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

చెంగిచెర్ల క్రాస్ రోడ్డు నుంచి..

మేడిపల్లి: మేడిపల్లిలోని ప్రధాన రహదారి చెంగిచెర్ల క్రాస్ రోడ్డు నుంచి సంపూర్ణ హోటల్ మెయిన్ రోడ్డు వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం 11కేవీ చెంగిచెర్ల ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు. కమలానగర్(ఎంకెబిఈఆర్) ఎస్‌వీ కాలనీ, శ్రీసాయినగర్ ఈస్ట్, సుదర్శన్ నగర్ కాలనీ, సూర్యోదయనగర్ కాలనీ, ధరణి కాలనీ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

బోడుప్పల్‌లో..

బోడుప్పల్: 11కేవీ బృందావన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయిమారుతీనగర్, మహాలక్ష్మీనగర్, రాఘవేంద్రనగర్, బృందావన్ కాలనీ, కేశవనగర్, మా గార్డెన్, ఆకృతి టౌన్‌షిప్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాప్రాలో..

కాప్రా: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సైనిక్‌పురి సబ్‌స్టేషన్ రామాలయం ఫీడర్, ఈశ్వరిపురి ఫీడర్, వాయుపురి ఫీడర్లలోని డిఫెన్స్ కాలనీ, వాయుపురి, జేజేనగర్, నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్, నిర్మల్‌నగర్, సైనిక్‌పురి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హెటెన్షన్ ఫీడర్, గ్రీన్‌పార్కు ఫీడర్ల పరిధిలోని నేతాజీనగర్ చౌరస్తా, గ్రీన్‌పార్కు కాలనీ, రామ్‌దాస్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

కుషాయిగూడ అభివృద్ధికి పూర్తి సహకారం


కుషాయిగూడలో పర్యటిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి కుషాయిగూడ అభివృద్ధికి పూర్తి సహకారం అందజేస్తానని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆమె కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి కుషాయిగూడలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి పైప్‌లైన్, డ్రైనేజీ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. విక్రాంత్ వైన్స్ పక్క వీధిలోని అన్ని గల్లీల్లో మంజీరా పైప్‌లైన్ పనులు రెండు మాసాల్లో పూర్తయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల శ్రీకాంత్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణిగౌడ్, కిషోర్, వాసుదేవ్, వరప్రసాద్, బ్రహ్మాచారి, బాలనర్సింహ, వెంకులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్‌లో వ్యక్తి మృతదేహం లభ్యం

ఉప్పల్: ఉప్పల్ హెచ్ఎండీఏ భగాయత్ లే అవుట్‌లో కుళ్లిపోయిన గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో శిల్పారామం సమీపంలో చెట్లపొదల్లో గుర్తుతెలియని సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం కుళ్లిపోయే స్థితిలో ఉంది. గమనించిన హెచ్ఎండీఏ సెక్యూరిటీ గార్డు ఉప్పల్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. గుర్తు పట్టేందుకు వీలు లేకుండా శవం కుళ్లిపోయి ఉందని, దాదాపుగా 10 రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఎవరైనా హత్య చేశారా.. ? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

బోడుప్పల్ చిలుకానగర్ చౌరస్తాలో..

మేడిపల్లి: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోడుప్పల్ చిలుకానగర్ చౌరస్తాలో మంగళవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందుకున్న పోలీసులు పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, గడ్డం, వైట్‌కలర్ నెక్ టీషర్టు, బ్లూకలర్ జీన్స్ ధరించి ఉన్నాడని మేడిపల్లి పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.